# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం

Follow


పేజీలు 12

సోమవారం, 16 డిసెంబర్, 2024

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD


## జాకీర్ హుస్సేన్ కన్నుమూత

### అనారోగ్యంతో శాన్‌ఫ్రాన్సిస్కోలో తుదిశ్వాస



ఆయన ఒక సంచలనం.. సంగీత ప్రపంచంలో ఆయన ఒరవడి వేరు. మన సంప్రదాయ తబలాను ఆయన అంతర్జాతీయ వేదికలపై నిలిపాడు. తబలాపై ఝుంజా మారుతంలా కదిలే ఆయన వేళ్లు పాశ్చాత్య సంగీతకారులను అబ్బురపరిచాయి. ఆయన జుగల్ బందీలు హైలెట్. తండ్రి అల్లా రఖా బాటలో తబలా వాయిద్యంతో భారత్ ఖ్యాతిని ప్రపంచం ఎల్లెడలా చాటిన మహా కళాకారుడు జాకీర్ హుస్సేన్.. ఆయన కన్నుమూశారు.. తబలా చిన్నబోయింది.

# భూమిలేని నిరుపేదలకు కానుక

# 28న 6 వేలు..

## కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మొదటి విడుత..

**బీఆర్ఎస్ తినడానికి అప్పులు చేస్తే..**

**కాంగ్రెస్ వాటిని తీర్చడానికి అప్పులు చేసింది**

**అప్పుల లెక్కలు పక్కాగా ఉన్నాయ్.. అసెంబ్లీలో చర్చిద్దామా?**

**అప్పులపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం**

**పదేళ్లలో 7,11,911 కోట్లు అప్పులు చేసిన బీఆర్ఎస్ సర్కార్**


**అప్పులు,వడ్డీల కింద రూ.66,772 కోట్లు కడుతున్నాం**

**సంక్రాంతి లోగా రైతు భరోసా**

**రైతులకు వ్యవసాయానికి రూ. 50,953 కోట్లు ఖర్చు**

**ఖమ్మంలో మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి**

**ఖమ్మం, డిసెంబర్ 15:** భూమి లేని నిరుపేద కుటుంబాలకు ఏడాదికి రెండు విడతల్లో రూ.12 వేలు ఆర్థికసాయం చేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ చేసిన వాగ్దానాన్ని ఈనెల 28వ తేదీ నుంచి అమలు చేయబోతున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. అఖిల భారత కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం రోజు డిసెంబర్ 28న రాష్ట్రంలోని నిరుపేద కూలీల కుటుంబాలకు మొదటి విడతగా 6వేల రూపాయలను ప్రజా ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన విధంగా వచ్చే సంక్రాంతి నుంచి రైతులకు రైతు భరోసా డబ్బులు ఇస్తామని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా 2 లక్షల రుణాలు ఉన్న రైతులందరికీ నేరుగా వారి ఖాతా ల్లో 21వేల కోట్ల రూపాయలను జమ చేసి, దేశానికి ఆదర్శంగా తెలంగాణ ప్రభు త్వం నిలిచిందన్నారు. రాష్ట్ర ఆర్థిక, అప్పు ల పరిస్థితిపై ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా అబద్ధాలు ప్రచారం చేస్తోందని విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడారు. గత పదేళ్లలో ప్రత్యక్షంగా, పరోక్షంగా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన 7,11,911 కోట్ల రూపాయల అప్పులకు సంబంధించి తమ దగ్గర పక్కా లెక్కలు ఉన్నాయని తెలిపారు. నేడు తాము అప్పు లు చేసినట్లుగా ఆ పార్టీ ప్రచారం చేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ సర్కార్ తినడానికి అప్పులు చేస్తే వారు చేసిన అప్పులకు అసలు, వడ్డీలు కట్టేందుకు కాంగ్రెస్ ప్రభు త్వం అప్పులు చేసిందని వివరించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వచ్చిన నాటి నుంచి రూ.54,118 కోట్లు అప్పులు చేయగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు, వడ్డీలకు మొత్తం రూ. 66, 782 కోట్లు బ్యాంకులకు కట్టామన్నారు. అసెంబ్లీలో ఎవరు ఎన్ని అప్పులు చేశారో అసెం బ్లీలో చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014 నాటికి రాష్ట్ర ప్రభుత్వం నేరుగా తీసుకున్న అప్పులు 72,658 కోట్లు ఉండగా, 2024 నాటికి 3,89,673 కోట్లు రూపాయలు గత బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు చేసిందని వివరించారు. కార్పొరేషన్ల పేరిట ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చి తీసుకున్న అప్పులు 2014 నాటికి 5,893 కోట్ల రూపాయలు ఉండగా, 2024 నాటికి 95,462 కోట్లు, ప్రభుత్వ గ్యారంటీ లేకుండా వివిధ కార్పొరేషన్లు నేరుగా చేసిన అప్పులు 2014 నాటి కి ఏమీలేకపోగా, 2024 నాటికి 59,414 కోట్లు రూపాయలు అప్పులు గత పాలకు లు చేశారన్నారు. ఇవే కాకుండా గత పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పాలకులు ఇరిగేషన్, ఆర్‌అండ్‌బి, పంచాయతీ రాజ్, హా స్పిటల్, ఉద్యోగుల జిపిఎఫ్, మిడ్‌డే మీల్స్, పీజు రియంబర్స్‌మెంట్ తదితర వాటికి అప్పుగా పెట్టినవి 40, 154 కోట్ల రూపాయలు - మిగతా 2వ పేజీలో



**ప్రభుత్వంపై బురద చల్లొద్దు**

**ప్రజలను పక్కదారి పట్టించొద్దు**

**బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు పీసీసీ చీఫ్ ఆరు పేజీల లేఖ**



# ఓడించినా బుద్ధిరాలె

**హైదరాబాద్, డిసెంబర్ 15:** పదేళ్ల మీ పాలనపై విసుగు చెంది ప్రజలు ఓడించినా ఇంకా బుద్ధి రాలేదా... రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై నిత్యం బురద జల్లుతూ ప్రజలను పక్కదారి పట్టించడం ఇకనైనా మానుకోవాలంటూ పీసీ సీ అధ్యక్షుడు బి మహేష్ కుమార్ గౌడ్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బహిరంగ లేఖ రాశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వంపై చేస్తున్న ఆరోపణలపై స్పష్టత ఇచ్చే దిశగా తను ఈ లేఖ రాస్తున్నానంటూ ఆయన 6 పేజీల లేఖలో పేర్కొన్నారు. సెంటిమెంట్ పేరుతో రెండు దఫాలుగా అధికారం చేపట్టిన మీరు గడీల పాలన చేసి ప్రజలకు కన్నీరు మిగిల్చారని ఆయన ఆరోపించారు. రాష్ట్రానికే గుండెకాయలాంటి సచివాలయానికి రాకుండా ఫాంహౌస్‌కే పరిమితమై పాలన సా గించడంతో కేసీఆర్ హయాంలో అవినీతికి అడ్డూ అదుపు లేకుండా పోయిందన్నారు. పెత్తందారు సర్కార్ తీరుతో విసిగిపోయిన ప్రజలు బీఆర్ఎస్ పాలనకు చరమగీతం పాడినా కేసీఆర్, వారి కుటుంబ సభ్యుల్లో, ఆ పార్టీ నేతల్లో కానీ ఎలాంటి మార్పు రాలేదన్నారు.

**ఇంటికో ఉద్యోగమని..:** గంపెడాశలు పెట్టుకున్న యువతకు ఉద్యమ సమయంలో ఇంటికో ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక కేసీఆర్ కుటుంబం లోని సభ్యులకే రాజకీయ ఉపాధి కల్పించుకున్నా రని మహేష్ గౌడ్ అన్నారు. పదో తరగతి మొదలు గ్రూప్ పరీక్షల వరకు అన్నింటా అవకతవకలు, గందరగోళమేనన్నారు. ఏడాదిలోనే రాష్ట్రంలో దాదాపు 54 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి దేశంలోనే రికార్డు నెలకొల్పామని తెలిపారు. ఉద్యమంలో మరో నినాదమైన నీళ్లను కూడా కేసీఆర్ పాలనలో నీరుగార్చారన్నారు. అవినీతే లక్ష్యంగా కొత్తగా కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టి.. డిజైన్‌ను ఇంజినీర్లు చేపట్టాల్సి ఉండగా, ఆయనే కాళేశ్వరం డిజైన్ రూపకర్తను అంటూ గర్వంగా చెప్పుకున్న మీరు ప్రాజెక్టు నాణ్యతా లోపంలో కూడా బాధ్యతవహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. గొప్పగా చెప్పుకునే కాళేశ్వరం కింద మూడు బ్యారేజీలు పని చేయకపోయినా తెలంగాణ రైతులు ఈ ఖరీఫ్ సీజన్లో 66.76 లక్షల ఎకరాల్లో 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఉత్పత్తి చేసేలా సాగు నీరు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు.

**రాష్ట్ర చరిత్రలో అతిపెద్ద అవినీతి మీది..:** తెలంగాణ నిధులను - మిగతా 2వ పేజీలో

## నువ్వు జైలు జీవితం అనుభవించావని అందర్నీ జైలుకు పంపుతావా?

### రేవంత్‌పై కేటీఆర్ ఫైర్



**హైదరాబాద్, డిసెంబరు 15:** 'బ్యాగు నిండా నోట్ల కట్టలతో పట్టుబడి జైలు జీవితం అనుభవించిన నీలాగే.. అందర్నీ జైలుకు పంపాలని అనుకుంటున్నావా రేవంత్ రెడ్డీ' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. తమ సంస్థ కార్యకలాపాల గురించి, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన పథకం ప్రభావాన్ని చెప్పినందుకు ఎల్ అండ్ టీ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ను జైలుకు పంపిస్తాననడం సీఎం స్థాయి వ్యక్తికి తగదని విమర్శించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టిన సంస్థల అధిపతులను జైలుకు పంపుతానని రేవంత్ రెడ్డి బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఇది సరైంది కాదని కేటీఆర్ ఆదివారం 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ఈ విషయంలో సీఎం చేసిన వ్యాఖ్యలు దిగజారుతున్న ఆయన మానసిక స్థితిని తెలియజేస్తున్నాయని వ్యాఖ్యానించారు. 'ఇలాంటి నిర్లక్ష్య వ్యాఖ్యలతో పరిశ్రమలకు ఏ సందేశం పంపుతున్నారు? ఇదేనా రాహుల్ గాంధీ దేశంలో పెట్టుబడులను ఆకర్షించడానికి తమ పార్టీ ముఖ్యమంత్రులకు నేర్పించిన గొప్ప వ్యూహం?' అని నిలదీశారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో పురోగమించిన తెలంగాణ... అనుభవరాహిత్యం, అసమర్థత - 2వ పేజీలో

# కేసీఆర్‌కు అండగా గద్దర్

## తన పాటలతో ఉద్యమానికి ఊపు తెచ్చిన విప్లవ వీరుడు



### త్వరలో సిద్దిపేటలో గద్దర్ విగ్రహం: హరీశ్‌రావు

**సిద్దిపేట అర్బన్, డిసెంబరు 15:** తెలంగాణ ఉద్యమానికి, కేసీఆర్‌కు గద్దర్ అండగా నిలబడ్డారని మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. ఐదు దశాబ్దాల కాలంలో జరిగిన ప్రతి పోరాటంలో గద్దర్ తన వంతు పాత్ర పోషించి పోరాటయోధుడిగా, తన పాటలతో ఉద్యమాలకు ఊపు అందించిన వీరుడిగా నిలిచారని మెచ్చుకున్నారు. 'గద్దర్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో గద్దర్ సాహిత్య పుస్తకాలను ఆదివారం సిద్దిపేటలోని విపంచికళా నిలయంలో హరీశ్‌రావు ఆవిష్కరించి మాట్లాడారు. విప్లవ ఉద్యమం, తెలంగాణ ఉద్యమం.. ప్రతి దాంట్లో గద్దర్ న్యాయం వైపు నిలిచి అన్యాయాన్ని ప్రశ్నించారని - మిగతా 2వ పేజీలో

# అధ్యక్ష రేసులో లేను

- రాష్ట్ర పార్టీలో నియామకాలపై చర్చ కూడా జరగలే
- నాకు బాధ్యతలు అప్పగిస్తారనేది ఊహాగానాలే
- మంత్రి పదవి రూపంలో పెద్ద బాధ్యతలో ఉన్నా..
- తప్పుడు ప్రచారాలతో నాపై కుట్రలు పన్నుతున్నారు
- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు

2లో



# తప్పు నాదే.. క్షమించండి



- సారీ చెప్పడం తప్ప మాట్లాడలేని స్థితిలో ఉన్నా
- జర్నలిస్టు రంజిత్‌తో మంచు మోహన్‌బాబు
- విష్ణుతో కలిసి ఆస్పత్రికి వెళ్లి పరామర్శ
- కుటుంబానికి అండగా ఉంటానని హామీ
- జర్నలిస్టు త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష

**హైదరాబాద్ సిటీ, డిసెంబరు 15:** జర్నలిస్టుపై దాడి ఘటనలో సినీనటుడు మోహన్ బాబు తన తప్పును అంగీకరించారు. బాధిత జర్నలిస్టు రంజిత్, అతని కుటుంబ సభ్యులకు స్వయంగా క్షమాపణలు చెప్పారు. జల్‌పల్లిలోని తన నివాసం వద్ద తాను చేసిన దాడిలో గాయపడి ఆస్పత్రిపాలైన జర్నలిస్టు రంజిత్‌ను మోహన్ బాబు ఆదివారం పరామర్శించారు. తన కుమారుడు మంచు విష్ణుతో కలిసి సోమాజీగూడలోని యశోద ఆస్పత్రికి వెళ్లిన ఆయన.. బాధిత జర్నలిస్టుకు క్షమాపణ చెప్పారు. రంజిత్ కుమార్తె, ఇతర కుటుంబసభ్యులకు కూడా క్షమాపణలు తెలియజేశారు. ఆ రోజు జరిగిన ఘటనకు తాను బాధపడుతున్నానని, అలా జరిగి ఉండాల్సింది కాదని, తప్పు - మిగతా 2వ పేజీలో

వాయిస్ టుడే
జనగాత్రం - మననేత్రం
హైదరాబాద్
సోమవారం, 16 డిసెంబర్, 2024

# నువ్వు జైలు జీవితం అనుభవించావని అందర్నీ జైలుకు పంపుతావా?

(మొదటి పేజీ తరువాయి)

అవినీతి కలగలసిన రేవంత్ రెడ్డి పాలనలో అన్ని రంగాల్లో తిరోగమిస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి రవాణా శాఖ ఆదాయం ఒక ముఖ్యమైన సూచీ అని, ప్రజల ఆర్థిక పరిస్థితులు బాగుంటే బైకులు, కార్లే కాకుండా.. ఇతర భారీ వాహనాల అమ్మకాలు, రిజిస్ట్రేషన్లు వృద్ధిని చూపిస్తాయన్నారు. కానీ రాష్ట్రంలో రిజిస్ట్రేషన్లు తగ్గి, ఆదాయం తిరోగమనంలో ఉందన్నారు. పొరుగున ఉన్న అయిదు రాష్ట్రాల్లో ఈ ఏడాది రవాణా శాఖ ఆదాయంలో 8 శాతం నుంచి 32 శాతం వృద్ధి నమోదైతే... తెలంగాణలో గత ఏడాది కంటే తక్కువగా ఉండడం విఫల ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతోందన్నారు. పాలన గాలికొదిలేసి కక్ష సాధింపు చర్యలకే పూర్తి సమయం కేటాయిస్తే ఫలితాలు ఇలాకాక మరెలా ఉంటాయని కేటీఆర్ విమర్శించారు. కాగా, టీపీసీసీ అధ్యక్షుడు ప్రశ్నించాల్సింది మాజీ సీఎం కేసీఆర్‌ను కాదని, సీఎం రేవంత్‌రెడ్డి తప్పిదాలపై నిలదీయాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద పేర్కొన్నారు. ఆదివారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ రేవంత్ రెడ్డికి రాసిన లేఖను కేసీఆర్‌కు పంపారనే అనుమానం కలుగుతోందన్నారు.ది

# కేసీఆర్‌కు అండగా గద్దర్

(మొదటి పేజీ తరువాయి)

కొనియాడారు. సామాన్య పదాలతో ప్రజల హృదయాలల్లోకి చేరే విధంగా గద్దరన్న పాటలు ఉంటాయని, మలిదశ ఉద్యమంలో ఆయనతో కలిసి పని చేయడం తాను అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. 'పొడుస్తున్న పొద్దుమీద' పాట తెలంగాణ ఉద్యమానికి ఊపు తెచ్చిందని గుర్తుచేశారు. తెలంగాణ వచ్చాక జీహెచ్ఎంసీ మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదని గద్దర్ లెటర్ రాస్తే వారికి వెంటనే ఒక్క సంతకంతో జీతాలు పెంచి గద్దర్‌కు కేసీఆర్ ఎంతో గౌరవం ఇచ్చారని చెప్పారు. 'తూప్రాన్‌లో నీళ్లులేవు.. హల్దీ వాగులో నుంచి వాటిక చెరు వుకు లిఫ్ట్‌పెట్టాల'ని గద్దర్ కోరితే 8 నెలల్లో పూర్తి చేసి ఆయనతోనే ప్రారం భించామని గుర్తుచేశారు. త్వరలో సిద్దిపేటలో గద్దరన్న విగ్రహం ఏర్పాటు చేస్తామని తెలిపారు. గద్దర్ ఫౌండేషన్ పేరిట తన తండ్రి పోరాటాన్ని రేపటి తరానికి తెలియ జేస్తున్న గద్దర్ తనయుడు సూర్యంను ఈ సందర్భంగా హరీశ్‌రావు అభినందించారు.

# కఠినంగా గ్రూప్-2 ప్రశ్నలు

## మొదటి రోజు ముగిసిన పేపర్-1, 2.. 46.30% మంది హాజరు

## వికారాబాద్‌లో సెల్‌ఫోన్‌తో దొరికిన అభ్యర్థి

## నేడు పేపర్ 3, 4 పరీక్షలు



**డిసెంబర్ 15:** గ్రూప్ 2 పరీక్షకు సంబంధించిన రెండు పేపర్లలోనూ ప్రశ్నలు కఠినంగానే ఉ న్నాయని, జవాబులు గుర్తించడం కష్టంగా మారిందని పలువురు అభ్యర్థులు పేర్కొన్నా రు. పేపర్ 1 కంటే పేపర్ 2 కాస్త తేలికగా ఉం దని చెప్పారు. మొత్తం 783 గ్రూప్2 పోస్టు ల భర్తీకి 5,51,855 మంది అభ్యర్థుల కోసం టీజీపీఎస్సీ రాష్ట్రవ్యాప్తంగా 1,368 కేంద్రా లు ఏర్పాటు చేసింది. ఆదివారం నిర్వహించిన పేపర్-1 పరీక్షకు 2,57,981 (46.75 శాతం) మంది, పేపర్-2కు 2,55,490 (46.30 శాతం) మంది హాజరయ్యారు. బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం పరిశిలించారు. పేపర్-1లో రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై, సినీరంగం, అంతర్జాతీయ అంశాలు, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లిష్, రీజనింగ్‌పై ప్రశ్నలు రాగా, పేపర్-2లో నిజాం నవాబుల కాలం, జోగినీ వ్యవస్థ, సికింద్రాబాద్ ఉజ్జయినీ ఆల యం, జాతీయ బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈ డబ్ల్యూఎస్ కమిటీలు, రిజర్వేషన్లు, మహిళా రిజర్వేషన్.. రాష్ట్రపతి, ప్రధాని, గవర్నర్ అధికారా లు, తెలంగాణ జిల్లాలు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల అధికారాలపై ప్రశ్నలు అడిగినట్టు అభ్య ర్థులు తెలిపారు. సోమవారం పేపర్ 4 పరీక్షలు నిర్వ హించనున్నారు.

### నిమిషం ఆలస్యంతో వెనక్కి

గ్రూప్2 పరీక్షకు ఒక్క నిమిషం నిబంధన ఉండటంతో అభ్యర్థుల కొంప ముంచింది. చాలా జిల్లాల్లో అభ్యర్థులు ఆలస్యంగా కేంద్రాలకు వెళ్లడంతో సిబ్బంది అనుమతించ లేదు. దీంతో అభ్యర్థులు నిరాశతో వెనుదిరిగారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆలస్యంగా రావడంతో 16 మంది అభ్యర్థులు పరీక్షకు దూరమయ్యారు. జనగామ జిల్లాలో ఓ బాలింత అరగంట ముం దే పరీక్ష కేంద్రానికి చేరుకున్నా పరీక్ష రాసే అవకాశాన్ని కోల్పోయారు. జనగామ పట్టణంలో పక్కపక్కనే రెండు పరీక్ష కేంద్రాలు ఉండటంతో పొరపాటున అరగంట ముందే మరో సెంటర్‌కు వెళ్లింది. ఇన్విజిలేటర్ ఓఎంఆర్ ఇచ్చే సమయంలో పక్క సెంటర్ అని తెలిసి వెంటనే అక్కడికి వెళ్లింది. కానీ అప్పటికే అర్ధగంట సమయం గడిచిపోయింది. అధికారులు ఆమెను పరీక్ష రాసేందుకు అనుమతించకపోవడంతో కేంద్రం వద్దే విలపించింది. జనగామ క్రీస్తు జ్యోతి ఇంజినీరింగ్ కళాశాల కేంద్రానికి ఆలస్యంగా వచ్చి న ఐదుగురు అభ్యర్థులు పరీక్ష రాయకుండా వెనుదిరిగారు. వరంగల్‌లో ముగ్గురు అభ్యర్థులను అధికారులు అనుమతించలేదు. భూపాలపల్లిలో 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చిన అభ్యర్థిని లోనికి అనుమతించలేదు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 19 మంది, ములుగులో ఇద్దరు అభ్యర్థులను అనుమతించ లేదు. సంగారెడ్డిలో 15 మంది ఆలస్యంగా రావడంతో పరీక్ష రాయలేకపోయారు.

### లోదుస్తుల్లో సెల్‌ఫోన్

వికారాబాద్‌లోని శ్రీ సాయి డెంటల్ కళాశాలలో మధ్యాహ్నం 2 గంటలకు రెండో పేపర్ రాసేందుకు అభ్యర్థులందరు లోపలికి వెళ్లారు. ఓ అభ్యర్థి సెల్‌ఫోన్‌ను లోదుస్తుల్లో దాచుకుని లోపలికి వెళ్లిపోయాడు. పరీక్ష ప్రారంభమయ్యాక అతని తీరుపై ఇన్విజిలేటర్‌కు అనుమానం రావడంతో తనిఖీ చేయగా సెల్‌ఫోన్ ఉన్నట్టు గుర్తించారు. వెంటనే అతన్ని అక్కడ ఉన్న పోలీసులకు అప్పగించారు. కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి సెంటర్‌కు వెళ్లి అభ్యర్థిని విచారించారు. ఉదయం జరిగిన పరీక్షకు కూడా సెల్‌ఫోన్ లోపలికి తీసుకొచ్చాడా? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. సదరు అభ్యర్థిని రాత్రి 9:30 గంటల తర్వాత కూడా ఎస్పీ ఆధ్వర్యంలో విచారిస్తున్నారు. ఈ విషయమై టీజీపీఎస్సీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు సమాచారం.

### సెల్‌ఫోన్లు, బ్యాగుల డిపాజిట్‌కు రూ.100

సంగారెడ్డి జిల్లా ఎంఎన్‌ఆర్ మెడికల్ కళాశాలలో పరీక్ష కేంద్రంను ఏర్పాటు చేశారు. పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థుల సెల్‌ఫోన్‌లు, బ్యాగులు డిపాజిట్ చేసుకునేందుకు గేట్ వద్ద ఉన్న సిబ్బంది ఒక్కరి వద్ద రూ.50 నుంచి రూ.100 వసూలు చేయడంతో అభ్యర్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ క్రాంతి వల్లూరు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు ఆదేశాలు జారీచేశారు. అదనపు కలెక్టర్ కళాశాలకు చేరుకుని వసూలు చేసిన డబ్బులు తిరిగి ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు.

# భూమిలేని నిరుపేదలకు కానుక ..28న ఆరు వేలు

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయని, వీటన్నింటిని కలిపితే మొ త్తం 7,11,911 కోట్ల అప్పుల భారాన్ని గత బీఆర్‌ఎస్ పాలకులు ప్రజలపై మోపి తగుదనమ్మా అంటూ కేటీఆర్, హరీశ్‌రావులు ప్ర జలను తప్పుదోవ పట్టించే విధంగా రాష్ట్రంఅప్పులు గురించి పచ్చి అబద్ధాలు మాట్లా డుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభు త్వం చేసిన అప్పులకు బ్యాంకులకు 2014 నాటికి సంవత్సరానికి రూ.6400 కోట్లు మాత్రమే చెల్లించగా, గత 10 ఏళ్లలో బీఆర్‌ఎస్ చేసిన అప్పుల వల్ల అప్పులు, వడ్డీలు కట్టడానికి 66,782 కోట్ల రూపాయలు చె ల్లించే దుస్థితికి ఈ రాష్ట్రాన్ని తీసుకెళ్ళి, గా యిగాయిగా మాట్లాడడం దేనికని అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులకు గాలి మాటలు చెప్పడం, లేనిది ఉన్నట్లు ఉన్నది లేనట్లు భ్రమ లు కల్పించి, ప్రజలను మోసం చేయడం బా గా తెలుసని అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత బీఆర్‌ఎస్ పాలకులు చేసిన ఆర్థిక విధ్వంసం అప్పుల గురించి శ్వేతపత్రం అసెంబ్లీలో విడుదల చేసి, ప్రజలకు వాస్తవాలు చెప్పామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పటికీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం కాం గ్రెస్ ప్రభుత్వం గ్యారంటీలను అమలు చేస్తున్నదని చెప్పారు.



### రైతుల కోసం 50,953 కోట్లు ఖర్చు

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు వ్యవసాయానికి, రైతుల కోసం నేరుగా 50,953 కోట్లు ఖర్చు చేసిందని భట్టి తెలిపారు. రైతు భరోసాకు 7625 కోట్లు , రైతు రుణమాఫీకి 21వేల కోట్ల, రైతు భీమా ప్రీమియం చెల్లింపునకు రూ. 1514 కోట్లు, ఫర్ డ్రాప్ మోర్ క్రాప్ కోసం 40 కోట్లు, రైతులకు విత్తనాల కోసం 36 కోట్లు, వ్యవసాయ పంపు సెట్లకు ఇస్తున్న సబ్సిడీకి రూ. 11,270 కోట్లు ఇస్తున్నామన్నారు. వ్యవసాయానికి కావాల్సిన సాగునీరు పనుల కోసం 9795 కోట్లు కలిపి మొత్తం 50, 953 కోట్లు ఖర్చు చేసి నిబద్ధత చాటుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వమని చెప్పారు. అదే విధంగా గత ప్రభుత్వం పంట నష్టపరిహారాన్ని పూర్తిగా విస్మరించగా ప్రజా ప్రభుత్వం ఎకరాకు పదివేలు చెల్లించిందని చెప్పారు. బీఆర్‌ఎస్ కట్టామని చెప్పుకుంటున్న కాళేశ్వరం ప్రాజెక్టుతో సంబంధం లేకుండా గత కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మాణం చేసిన ప్రాజె క్టుల నుంచి పారిన నీళ్లతో పండిన ప్రతి గింజను ప్రజా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. కొనుగోలు చేసి ధాన్యం డబ్బులను వారం రోజుల్లో రైతు లకు చెల్లిస్తున్నా మని చెప్పారు. సన్న వడ్లకు క్వింటాకు 500 బోనస్ చెల్లిస్తున్నామన్నారు. ప్రతి ఎకరాకు పది నుం చి పదిహేను వేల రూపాయలను అదనంగా రైతులు లబ్ధి పొందుతున్నారని అన్నారు. 1.20 లక్షల కోట్ల రూపా యలతో గొప్పగా, అద్భుతంగా కాళేశ్వరం కట్టామని బీఆర్ ఎస్ నాయకులు చెప్పారని, కానీ కాళేశ్వరంతో సంబంధం లేకుం డా ఈ ఏడాది వరి ఉత్పత్తి గణనీయంగా పెరిగిందన్నారు.

### నాలుగు కొత్త విమానాశ్రయాలు

రాష్ట్ర వ్యాప్తంగా పరిశ్రమల విస్తరణ కోసం ప్రజా ప్రభుత్వం కొత్తగూడెం, రామగుండం, ఆదిలాబాద్, వరంగల్ ప్రాంతాల్లో విమానాశ్రయాలను ఏర్పాటు చేస్తామన్నారు. హైదరాబాద్ నగరంలో ఫ్యూచర్ సిటీని నిర్మాణం చేస్తున్నామన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన స్పోర్ట్స్ యూనివర్శిటీ, స్కిల్ యూనివర్శిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరం గుండా 55 కిలోమీటర్లు మేర ప్రవహిస్తున్న మూసిని ప్రక్షాళన చేసి, పునర్జీవం తీసుకువచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుంద న్నారు. అన్ని జిల్లాలను కలుపుతూ రీజనల్ రింగ్‌రోడ్డు ఏర్పాటు చేస్తామన్నారు. ఓటర్ రింగ్ రోడ్ రీజనల్ రింగ్ రోడ్ మధ్యన ఇండస్ట్రీయల్ , హౌసింగ్ క్లస్టర్లు ఏర్పాటు చేసి, భవిష్యత్ తరాలకు అందిస్తామన్నారు.

# ఓడించినా బుద్ధిరాలె!

(మొదటి పేజీ తరువాయి)

దోచుకున్నారని ఉద్యమ సమయంలో ప్రజలను రెచ్చగొట్టిన కేసీఆర్, ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనే లేనివిధంగా అవినీతికి పాల్పడ్డారని పీసీసీ చీఫ్ ఆరోపించారు. ప్రాజెక్టులు, ఫ్లఓవర్లు ఇలా అన్ని రంగాల్లో అవినీతి చేశారని అన్నారు. ధరణి పేరుతో మీ పార్టీ నేతలు పేదల భూములు కొల్లగొట్టి దోచుకున్న దాంట్లో తెరవెనుక ఎవరున్నారో అందరికీ తెలుసన్నారు. 2014 జూన్ 2న రాష్ట్రం ఏర్పడే నాటికి రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో తెలంగాణ ఉండగా, పదేళ్ల తర్వాత కాంగ్రెస్ అధికారం చేపట్టే నాటికి రాష్ట్రం రూ.7 లక్షల కోట్ల అప్పుతో ఉందనేది వాస్తవం కాదా.. మీరు చేసిన అప్పులతో ప్రస్తుతం ప్రతి నెల రూ.6500 కోట్ల అసలు, మిత్తీ చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల లోపు రుణాలను మాఫీ చేసిందన్నారు. సంకల్ప బలంతో రూ.21 వేల కోట్లు మాఫీ చేయడంతో, రాష్ట్రంలో 25 లక్షల మంది రైతులు రుణమాఫీ సహాయం పొందడాన్ని మేము గర్వంగా భావిస్తున్నామన్నారు.

**పంటల బీమా మేమే చేశాం....:** బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పంటల బీమా లేకపోవడంతో రైతాంగం నష్టపోగా కాంగ్రెస్ ప్రభుత్వం 42 లక్షలకుపైగా రైతులకు బీమా కవరేజీ కోసం రూ.1,433.33 కోట్ల ప్రీమియం చెల్లించినట్లు మహేష్ గౌడ్ తెలిపారు. అకాల వర్షాలతో నష్టపోయిన 94 వేల మందికి పైగా రైతులకు రూ.95.38 కోట్ల పంట నష్టాన్ని చెల్లించి కాంగ్రెస్ ప్రభుత్వం వారిని ఆదుకుందన్నారు. సన్నాలు పండించిన వారికి రూ.500 బోనస్ చెల్లించింది. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి సంక్రాంతికి రైతు భరోసా నిధులు విడుదల చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.

**తెలంగాణ తల్లిపైనా రాజకీయం...:** అధికారంలో ఉన్న పదేళ్లు అధికారికంగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయని బీఆర్‌ఎస్ సర్కారు ఇప్పుడు తాము ఏర్పాటు చేస్తే విమర్శించడం ఎంత వరకు సమంజసమని పీసీసీ చీఫ్ ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో రాచరికానికి దర్పణంగా కిరీటంతో, బతుకమ్మతో విగ్రహం ఉంటే, తాము ఏర్పాటు చేసిన విగ్రహంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదా యాలు ఉట్టిపడుతూ సహజసిద్ధమైన మాతృమూర్తిలా ఉంద న్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉర్రూతలూగించిన



"జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం" గీతం రచయిత అందెశ్రీపై మీరు కక్షగట్టి అవమానించి, రాష్ట్రానికి పదేళ్లు అధికారిక గీతం లేకుండా చేసిన తీరును మర్చిపోయారా అని ప్రశ్నించారు.

**మహాలక్ష్మిని మేం తెస్తే... సారా కేసులో కవిత జైలుకెళ్లింది..:** 'మహాలక్ష్మి' పథకంలో భాగంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చి మాది మహిళా పక్షపాత ప్రభుత్వమని నిరూపిం చుకున్నామని పీసీసీ చీఫ్ అనారు. అదే సమయంలో మీ కూతురు కవిత సారా స్కాంలో జైలుపాలు కావడాన్ని రాష్ట్రంలోని మహిళలంతా అసహ్యించుకుంటున్నారని అన్నారు. మొదటి తెలంగాణ మంత్రివర్గంలో ఒక్క మహిళా మంత్రి కూడా లేకుండా పాలించిన చరిత్ర మీదని అన్నారు. మూసీ గురించి బీఆర్‌ఎస్ వారు ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని... మూసీ సుందరీకరణ చేస్తానని గతంలో చెప్పిన మాట గుర్తుందా.. అని ప్రశ్నించారు. హైదరాబాద్ డల్లాస్, పాతబస్తీ ఇస్తాంబుల్‌గా మారాయా అని ప్రశ్నించారు. పాతబస్తీలో మెట్రో రైలుపై కేసీఆర్ దాటవేత వైఖరి ప్రదర్శిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పనులను పట్టాలెక్కించేందుకు చర్యలు తీసుకుందన్నారు.

### అసెంబ్లీకి వచ్చి సూచనలివ్వండి...

అధికారంలో ఉన్న పదేళ్లు పలు మీడియా సమావేశాలు నిర్వహించి కాకమ్మ కథలు చెప్పిన కేసీఆర్... ఇప్పుడు మౌనవ్రతం చేపట్టి ఫాం హౌస్‌కే ఎందుకు పరిమితమయ్యా రని ప్రజలు ప్రశ్నిస్తున్నారని మహేష్ గౌడ్ అన్నారు. కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితం కాకుండా, ప్రతిపక్ష నేతగా అసెంబ్లీకి వచ్చి రాష్ట్ర అభివృద్ధికి మీ సలహాలు, సూచనలు ఇస్తే బాగుంటుందన్నారు.

# తప్పు నాదే.. క్షమించండి

(మొదటి పేజీ తరువాయి)

తనదేనని రంజిత్‌తో అన్నారు. క్షమించమని అడగడం తప్ప.. ఏమీ మాట్లాడలేని పరిస్థితిలో ఉన్నానని రంజిత్, అతని భార్యాపిల్లలకు వివరణ ఇచ్చుకున్నారు. అలాగే, రంజిత్ కుమార్తెను ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని ఎత్తుకున్నారు. సారీ తల్లి నా వల్లే మీ నాన్నకు ఈ పరిస్థితి వచ్చిందని ఆ చిన్నారితో అన్నారు. అనంతరం, రంజిత్, అతని కుటుంబసభ్యులతో మాట్లాడి.. రంజిత్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. రెండు కాళ్లు, భుజాలు, కళ్లకు శస్త్రచికిత్స చేయించుకున్న తనకు... శస్త్రచికిత్సల బాధ ఎలా ఉంటుందో తెలుసునని ఈ సందర్భంగా వారితో అన్నారు. రంజిత్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రంజిత్ కుటుంబానికి అండగా ఉంటానని, ఏ సాయం చేయడానికైనా సిద్ధమని హామీ ఇచ్చారు.

# అధ్యక్ష రేసులో లేను

(మొదటి పేజీ తరువాయి)

**కరీంనగర్, డిసెంబరు 15:** బీజేపీ తెలంగాణ అధ్యక్ష పదవి రేసులో తాను లేనని ఆ పార్టీ నేత, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. పార్టీ నాయకత్వం తనకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి పదవి రూపంలో పెద్ద బాధ్యత అప్పగించిందని, దానిని సమర్థవంతంగా నిర్వర్తించేందుకు ప్రయత్నిస్తున్నా నని తెలిపారు. ఈ మేరకు కరీంనగర్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బండి సంజయ్‌కు పార్టీ పగ్గాలు అప్పగిస్తారనే మాటలు ఊహాగానాలేనని తేల్చి చెప్పారు. పార్టీ అధినాయకత్వం రాష్ట్ర అధ్యక్ష పదవిపై అసలు దృష్టి సారించనేలేదన్నారు. పార్టీలో ప్రస్తుతం సం స్థాగత ఎన్నికలు జరుగుతున్నాయని, జిల్లా, రాష్ట్ర అధ్యక్ష నియామకాల అంశమే చర్చకు రాలేదని వివరించారు. పార్టీ అధ్యక్ష పదవి నియామకంపై హైక మాండ్‌దే తుది నిర్ణయమని వెల్లడించారు. తనపై అభిమానంతో కొందరు ప్రచారం చేస్తున్నారే తప్ప రాష్ట్ర అధ్యక్ష రేసులో తాను లేనని స్పష్టం చేశారు. ఇలాంటి ప్రచారాలతో కొందరు తనకు వ్యతిరేకంగా కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. తనకు, పార్టీకీ నష్టం కలిగించే తప్పుడు వార్తలను ప్రచారం చేయవద్దని మీడియాను కోరారు.

# నేటి నుంచి మళ్లీ అసెంబ్లీ

## ఉదయం 10 గంటలకు సెషన్స్ ప్రారంభం

## తొలిరోజు పలు కీలక బిల్లులపై చర్చ

## మాజీ ఎమ్మెల్యేల మృతికి సంతాపం

హైదరాబాద్, డిసెంబర్ 15 (విజయక్రాంతి): నేటి నుంచి అసెంబ్లీ శీతాకాల సమావేశాలు మళ్లీ ప్రారంభం కానున్నాయి. ఈ నెల 9న సెషన్స్ ప్రారంభం కాగా.. తెలంగాణ తల్లి విగ్రహంపై చర్చ అనంతరం ఒక్క రోజుతోనే ముగిశాయి. అనంతరం నేటికి వాయిదా వేశారు. కాగా సోమవారం ఉదయం 10 గంటలకు అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానుండగా.. 11 గంటల వరకు ప్రశ్నోత్తరాల కార్యక్రమం కొనసాగనుంది. గ్రామపంచాయతీల్లో బీటీ రోడ్లు, మున్సిపల్ కార్మికుల క్రమబద్ధీకరణ, పంచాయతీలు, మండల పరిషత్‌లు, జెడ్పీలకు సంబంధించిన పెండింగ్ బిల్లుల చెల్లింపు, ముదిరెడ్డిపల్లి చెరువులో నీటి కాలుష్యం, రాష్ట్రంలో నూతన టీజీఐఐసీ పార్కుల ఏర్పాటు, పర్యాటకానికి ప్రోత్సాహం, ఉస్మానియా వర్సిటీలోని బీఈ విద్యార్థుల డిటెన్షన్, బెల్టుషాపుల మూసివేత, ఐవీఎఫ్ కేంద్రాలు, జీరో ఎన్‌రోల్‌మెంట్ పాఠశాలలపై ప్రశ్నోత్తరాల కార్యక్రమం ఉంటుంది. అనంతరం ఇటీవల మృతి చెందిన మాజీ ఎమ్మెల్యేలు కె.జ్యోతీదేవి, ఊకే అబ్బయ్య, డి.రామచంద్రారెడ్డిలకు సంతాపం తెలుపనున్నారు. ఆ తర్వాత అసెంబ్లీ ముందుకు పలు బిల్లులు రానున్నాయి. స్పోర్ట్స్ యూనివర్సిటీ బిల్లు, విశ్వవిద్యాలయాల సవరణ బిల్లు, యువ భారత వ్యాయామ విద్య బిల్లు మండలిపై సభలో చర్చ జరుగుతుంది. ఇక మండలి సైతం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానుంది. మండలిలో మాజీ ఎమ్మెల్సీ ఇంద్రసేన్ రెడ్డి మృతికి సంతాపం తెలుపుతారు. తెలంగాణలో పర్యాటక విధానంపై ఉభయ సభల్లోనూ స్వల్పకాలిక చర్చ జరగనుంది. అలాగే రేపటి బీఏసీ సమావేశంలో శాసనసభ పనిదినాలపై చర్చ జరగనుంది.




# మెగా బ్రదర్స్ ఇంటికి అల్లు అర్జున్

## అల్లుడూ ఎలా ఉన్నావ్ అని అడిగిన చిరు

## సతీసమేతంగా చిరంజీవి వద్దకు అర్జున్

## అనంతరం నాగబాబు నివాసానికి కూడా..



**హైదరాబాద్, డిసెంబరు 15:** పుష్ప-2 ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట కేసులో శనివారం జైలు నుంచి విడుదలైన అల్లు అర్జున్.. తన మామ, ప్రముఖ సినీనటుడు చిరంజీవిని ఆదివారం కలిశారు. భార్య స్నేహారెడ్డి, పిల్లలు అయాన్, అర్హాతో కలిసి ఆదివారం మధ్యాహ్నం చిరంజీవి నివాసానికి వెళ్లారు. మరో కారులో అల్లు అరవింద్ వారిని అనుసరించారు. కాగా, చాలాకాలం తర్వాత తమ ఇంటికి వచ్చిన అల్లు అర్జున్‌ను చిరంజీవి దంపతులు సాదరంగా ఆహ్వానించారు. 'అల్లుడూ ఎలా ఉన్నావ్' అని అడుగుతూ అల్లు అర్జున్‌ను చిరంజీవి ఈ సందర్భంగా ఆలింగనం చే సుకున్నారు. అనంతరం అర్జున్ దంపతులు చిరంజీవి పాదాలకు నమస్కరించారు.